క్లుప్తంగా

20న జాబ్ మేళా

హాలియా : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల్లో ఐటీఐలో ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్ల అభ్యర్థులకు ఈనెల 20వ తేదీన అనుముల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా, జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మల్లిఖార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్ సైట్ www.apprenticehipindia.gov.in లో తమ పేర్లు నమోదు చేసుకొని ఆ నకలు కాపీని, బయో డేటా పారంతో పాటు సంబంధిత విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో అప్రెంటిసిషిప్ మేళా, జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 8686880100, 8341387860 నంబర్లను సంప్రదించాలన్నారు.

19న లలితా జ్యువెలర్స్ షోరూం ప్రారంభం

మిర్యాలగూడ : ప్రముఖ లలిత జ్యువెలర్స్ 58వ షోరూంను ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్డులో ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కౌన్సిలర్ మహమ్మద్ ఇలియాస్‌తోపాటు లలిత జ్యువెలర్స్ చైర్మన్ డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్‌లు పాల్గొనున్నట్లు షోరూం నిర్వాహకులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

దేవరకొండ: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూలు జిల్లా చారగొండ మండలానికి చెందిన హరిలాల్ అనే వ్యక్తి దేవరకొండ మండల పరిధిలోని ఎల్లారెడ్డిబావి గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించాడు. అనంతరం ఆ బియ్యాన్ని బొలేరో వాహనంలో తరలిస్తుండగా గురువారం రాత్రి దేవరకొండ పట్టణంలో పట్టుకున్నట్లు సీఐ తెలిపారు.

చిన్ననాయక్ మృతి బాధాకరం



నివాళులర్పిస్తున్న రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : మండలంలోని కొర్రోనితండాకు చెందిన చిన్నానాయక్ మృతి బాధాకరమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం కొర్రోనితండాలో చిన్ననాయక్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రమావత్ దస్రూనాయక్, రమావత్ తులసీరాం, కొర్ర బీమా, హరికృష్ణ, వెంకటేష్ తదితరులున్నారు.

భీమ్‌రెడ్డికి నివాళి

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నెమలి కృష్ణారెడ్డి తండ్రి భీమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని శుక్రవారం ఆ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భీమ్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లి పెద్దిరాజు యాదవ్, కున్‌రెడ్డి లింగారెడ్డి, మాలే సత్యంరెడ్డి, మల్లారెడ్డి, శివశంకర్ యాదవ్, అవుల శ్రీనివాస్ యాదవ్, సైదిరెడ్డి, బోయ వెంకట్‌రెడ్డి, నెమలి వెంకట్‌రెడ్డి, మల్లి, పాదిల మల్లయ్య యాదవ్‌చ జలెందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

కామాంధుడికి రిమాండ్

ఇబ్రహీంపట్నం : బీటెక్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కేపీవీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని మంగళ్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఖమ్మం జిల్లా విద్యార్థిని (18) బుధవారం అర్ధరాత్రి లైంగికదాడికి గురైంది. ఈ కేసులో నిందితుడైన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం జిన్నాయిచింత గ్రామానికి చెందిన ఎ.అజిత్(22)ను అరెస్టు చేసిన పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. హాస్టల్ భవన యాజమాని వద్ద అజిత్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత

రామగిరి (నల్లగొండ) : పట్టణంలో యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నాలుగు నెలలుగా మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శుక్రవారం సాగర్ ఎక్స్ రోడ్డులోని హిమగిరి కాలనీలో సర్వీస్ నౌ కంపెనీ సహకారంతో కుట్టుమిషన్లు అందజేశారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా అడ్వైజరీ బోర్డు మెంబర్ వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి, ఒకేషనల్ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ లక్ష్మి, యూత్ ఫర్ సేవా రీజినల్ కోఆర్డినేటర్ సునీల్, యూత్ ఫర్ సేవా సభ్యులు పాల్గొన్నారు.

సిద్ధంగా ఉన్నా.. పంపిణీ లేదు

- అంగన్‌వాడీ చిన్నారులకు అందని యూనిఫాం
- నెలల తరబడి ఆలస్యంపై విమర్శలు



చిన్నారులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాం



ఓ అంగన్‌వాడీ కేంద్రంలో బీరువాలో భద్రపరిచిన చిన్నారుల యూనిఫాం

మిర్యాలగూడ టౌన్ : విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరునెలలు అవుతుంది. మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టులోని అంగన్ వాడీల కేంద్రాల్లో నేటికీ చిన్నారులకు యూనిఫాంలను పంపిణీ చేయలేదు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేస్తున్న యూనిఫాంల మాదిరిగా ఈ సంవత్సరం నుంచి అంగన్‌వాడీల్లోని చిన్నారులకు పంపిణీ చేయాలని సర్కారు నిర్ణయించింది. పాఠశాల విద్యార్థులకు పాఠశాలల ప్రారంభంలోనే దుస్తులను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు మాత్రం దుస్తులు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. చిన్నారులకు అందజేసే ఏకరూప దుస్తులు కుట్టి సిద్ధం చేసినా పంపిణీకి నోచుకోవడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతో కూడినా విద్యను అభ్యసించే చిన్నారులకు సైతం డ్రెస్ కోడ్‌ను అమలు చేస్తున్నారు. ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులకు ఉచితంగా యూనిఫాం దుస్తులను పంపిణీ చేసేందుకు మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక చర్యలను చేపడుతుంది. అయితే మొదటి విడతలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. కేంద్రాల్లో అందమైన బొమ్మలు, రంగులు వేసి ఆకర్షిస్తున్నారు. పిల్లలకు యూనిఫాంలను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

మొదటి విడత 46 కేంద్రాల్లో..

మిర్యాలగూడ మున్సిపాలిటీతో పాటు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను క్రమంగా పూర్వ ప్రాథమిక పాఠశాలలు ప్రీ స్కూల్‌గా ఆఫ్ గ్రేడ్‌గా చేసింది. అందులో భాగంగానే మొదటి విడతగా ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా ఎంపిక చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు జూలై నెలలోనే జిల్లాకు దుస్తులు వచ్చాయి. వీటిని కుట్టే బాధ్యత పొదుపు సంఘాల వారికి అప్పగించింది. దీంతో వారు దుస్తులను కుట్టి స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించింది. దీంతో అన్ని ప్రాజెక్టు కార్యాలయంలో, మరి కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని బీరువాలో ములుగుతున్నాయి. మున్సిపాలిటీలో 100 అంగన్‌వాడీ కేంద్రాలు కాగా మిర్యాలగూడ రూరల్‌లో 111 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వీటి పరిధిలో మొదటి విడతలో 46 అంగన్‌వాడీలు ఎంపిక చేశారు.

ఆకర్షించే విధంగా డిజైన్లు

చిన్నారులకు ఆకర్షించే విధంగా పలు రకాల డిజైన్లలో ఏకరూప దుస్తులను ప్రభుత్వం ఎంపిక చేసింది. అయితే బాలురకు నెక్కర్, షర్టు కాగా బాలికలకు ఫ్రాక్ ఇవ్వనున్నారు. యూనిఫాంలతో చిన్నారులు మరింత మురిసిపోనున్నారు. తల్లిదండ్రులు కూడా యూనిఫాంలో తమ పిల్లలను చూసి సంతోషంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించారు. అయితే ఆ దుస్తులు చిన్నారులకు పంపిణీ చేయకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో బీరువాల్లోనే ములుగుతున్నాయి. పలు కేంద్రాల్లో దుస్తులకు ఉన్న మూడి కూడా ఇవ్వకుండానే బీరువాల్లో భద్రపరిచారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



కొండమల్లేపల్లి : గుమ్మడవెల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ విభాగంతో పాటు క్యాజువాలిటీ, డయాలసిస్ విభాగాలను ఆమె తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అస్పత్రికి వస్తున్న రోగుల వివరాలు, అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి సమయానికి వైద్యులు అందుబాటులో ఉంటున్నారా..ఎవరైనా వైద్యం కోసం డబ్బులు అడుగుతున్నారా.. వంటి వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కాగా ఆస్పత్రిలో తాగునీటి సమస్యతో పాటు మద్యం సేవించి రాత్రి సమయాల్లో కొందరు ఆస్పత్రికి వస్తున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ మంగ్తానాయక్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడి అవుట్ పోస్టు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణారెడ్డి, సూపరింటెండెంట్ మంగ్తానాయక్, తదితరులున్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

నూతన రేషన్ కార్డుల జారీలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠీ సూచించారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని తాటికోల్ రోడ్‌లో కొనసాగుతున్న రేషన్‌కార్డుల సర్వే ప్రక్రియను ఆమె పరిశీలించారు. రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల జాబితా ఆధారంగా దరఖాస్తుదారుల ఆదాయం, ఆర్థిక పరిస్థితి, కుటుంబ వివరాలు వంటి వాటిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్ ఉన్నారు.

గుమ్మడివెల్లిలో సర్వే పరిశీలన

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామపంచాయతీలో కొనసాగుతున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాకు సంబంధించిన భూముల సర్వేను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బొడ్డుపల్లి పెద్ద బుచ్చయ్య అనే వృద్ధుడు తనకు పెన్షన్ రావడం లేదని కలెక్టర్‌కు తెలుపడంతో కలెక్టర్ వెంటనే పంచాయతీ కార్యదర్శిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతు భరోసాకు సంబంధించిన సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రజాస్వామిక హక్కు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెద్దవూర : ఎస్సీ వర్గీకరణ ప్రజాస్వామిక హక్కు అని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ డప్పుల ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అధికారికంగా అమలు చేయాలని కోరారు. మంద కృష్ణమాదిగ తన ముప్పై ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణ ఒక కొలిక్కి వచ్చిందన్నారు. ప్రముఖ కవి, గాయకుడు రేపూరి ప్రతాప్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరిందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు, వేల గొంతులు మహా ప్రదర్శనకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న డప్పుల ర్యాలీ యాత్రకు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, కవిగాయకులు పాలడుగు అంజన్న, మేదరి కిరణ్‌కుమార్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు ఆడెపు నాగార్జునమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జిల్లా పవన్ కుమార్, నాయకులు బొజ్జ చిన్న, తరి ఏడుకొండలు, ఆదిమళ్ల ఎల్లయ్య, కుక్కమూడి ముత్యాలు, దుబ్బ రమేష్, తరి పెదనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్స్, టీచర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఫిజికల్ డైరెక్టర్స్, టీచర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా బొమ్మపాల గిరిబాబు, అధ్యక్షుడిగా ఇమాం కరీం, ప్రధాన కార్యదర్శులుగా నారాయణ, కవిత, కోశాధికారిగా ఎం.బాలరాజుయాదవ్, ఉపాధ్యక్షుడిగా కేతావత్ శ్రీనివాస్, ఎండీ.అజీజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాన్ని హర్షవర్ధన్‌రెడ్డి అందజేశారు.

మౌలికవసతులు కల్పించాలి

నల్లగొండ టౌన్ : పట్టణంలో గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, డబుల్ బెడ్‌రూం ఇళ్ల సాధన పోరాట కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద జరుగుతున్న పనులను వారు పరిశీలించి మాట్లాడారు. వారి వెంట అద్దంకి నరసింహ, ఊట్కూరి నర్సింహారెడ్డి ఉన్నారు.

చెక్కుల పంపిణీ

నల్లగొండ టూటౌన్ : సీఎం సహాయ నిధితో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన 41మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1,33,600ల విలువ గల చెక్కులను శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం సహాయ నిధి పథకం ద్వారా లక్షలాది మంది పేద ప్రజలకు సహాయం అందుతుందన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి



వేములపల్లి : ఇసుకబావిగూడెంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి (మాడుగులపల్లి) : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేలా తనవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మాడుగులపల్లి మండలంలోని పాములపాడు, పోరెడ్డిగూడెం, చిరుమర్తి, ఆగామోత్కూర్, గుర్రప్పగూడెం, భీమనపల్లి, కల్వలపాలెం, బొమ్మకల్, సీత్యాతండా, తోపుచర్ల, ఇసుకబావిగూడెం, కుక్కడం గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక నాయకులతో కలిసి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీ పథకాలు, «మన ఊరు -మన ఎమ్మెల్యే» కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి అమలు కానున్న రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు పథకాలను పేదలందరికీ అదించేందుదకు అధికారులు పకడ్బందీగా సర్వ చేసి అర్హులను గుర్తించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో కులమతాలకు అతీతంగా రిటైర్డ్ ఉద్యోగస్తులు, సీనియర్ నాయకులు, చదువుకున్న యువతతో కలిసి గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధికి, గ్రామాల్లో అర్హులైన పేదలకు పథకాలను వర్తింపజేసేలా కృషి చేస్తానన్నారు. తాను నిర్వహించే ఈశ్వరబంధం కార్యక్రమాన్ని మహా శివరాత్రి నుంచి ప్రారంభిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, చంద్రారెడ్డి, సత్తిరెడ్డి, సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బట్టు మాధవరెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

మిర్యాలగూడ : యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి మంచి గుర్తింపు సాధించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీబీకేవీ, ఎస్‌వీఆర్ జట్టుల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సీబీకేవీ జట్టు విజయం సాధించగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడల వల్ల యువకుల్లో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. క్రీడల వల్ల యవకుల్లో స్నేహ సంబంధాలు మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు చిలుకూరు బాలు, రవినాయక్, జానిపాషా, ముదిరెడ్డి నర్సిరెడ్డి, ధర్మానాయక్, రమేష్‌నాయక్, చక్రినాయక్, శరత్, అశోక్‌నాయక్, కృష్ణ, అనిల్‌కుమార్, నాగునాయక్, కోటి, శ్రీధర్, లక్ష్మణ్, ప్రశాంత్, మహేష్, గని, నాని తదితరులు పాల్గొన్నారు.

భూ పట్టాలు ఇప్పించాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కల్లెపల్లి గ్రామస్తులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లెపల్లిలో సర్వే నంబర్ 148లోని భూములను టీఎం33 కింద పట్టాలు అందించాలని పలువురు గ్రామస్తులు శుక్రవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తాము సర్వే నంబర్ 148లోని భూములను తమ తాతల కాలం నాటి నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో తహసీల్దార్ సర్వే చేసి తమకు పట్టాలు, పాస్‌బుకుక్కలు ఇచ్చారని, కాని ఐదేళ్ల క్రితం తమకు తెలియకుండా పహణీలో తమను తొలగించారని అప్పటి నుంచి తాము తహసీల్దార్‌కు పలుమార్లు విన్నవించినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాగయ్య. సైదయ్య, సైదులు, నాగేష్, పిచ్చయ్య, నాగమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శేషగిరిశర్మ

మిర్యాలగూడ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023- 24 గాను సోషల్ ఆడిట్ సంబంధించిన రికార్డులు సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఎం .శేషగిరిశర్మ అన్నారు. శుక్రవారం స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడ్ గవర్నెన్స్ రికార్డులు అప్‌డేట్ చేయాలని ప్రతి గ్రామంలో ప్రతిరోజు కనీసం 25 మందికి ఉపాధి హామీ పనులు కల్పించాలని ప్రతి గ్రామపంచాయతీ నర్సరీలో విత్తనాలు నాటించాలని కోరారు. జాబ్ కార్డులకు ఇంకా ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్‌లు అనుసంధానం చేయని వాటికి చేయించాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి ఏపీడీ బాలకృష్ణ, ఏపీఓ కళావతి, ఈసీ పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్, బాలు, రాజేశ్వరి, రేణుక, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని గణేష్‌పాడు వద్ద గల పెన్నా సిమెంట్(అంబుజా) కంపెనీ గనుల విస్తరణ, సున్నపురాయి ఉత్పత్తి పెంపుపై శనిశనివారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. 2002లో పెన్నా సిమెంట్స్‌ను నెలకొల్పగా రెండు నెలల క్రితం ఈ ప్లాంట్‌ను ఆదాని గ్రూప్ కొనుగోలు చేసింది. అనధికారికంగా గనుల విస్తరణ జరిగినప్పటికీ వివిధ కారణాల వల్ల పీసీబీ ప్రజాభిప్రాయం సేకరించలేదు. పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో శనివారం ప్లాంట్‌కు సమీపంలో అధికారులు సమావేశాన్ని నిర్వహించి ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నారు. దామరచర్ల మండలంలో గణేష్‌పాడు పరిధిలో 304 హెక్టార్ల భూమిని సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ పరిధిలో 50 హెక్టార్లలో మైనింగ్ లీజు ఉంది. 354 హెక్టార్ల సున్నపురాయి గనులను విస్తరించి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.5మిలియన్ టన్నుల నుంచి 1.8 మిలియన్ టన్నులకు పెంచేందుకు అనుమతి కోసం యాజమాన్యం దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు.

నల్లగొండ- దేవరకొండ రోడ్డుకు మరమ్మతులు



కొప్పోలు వద్ద జరుగుతున్న రహదారి మరమ్మతు పనులు

గుర్రంపోడు : నల్లగొండ - దేవరకొండ ప్రధాన రహదారి మరమ్మతుల పెండింగ్ పనులు చురుకుగా సాగుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర రహదారుల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ. పది కోట్లతో రహదారి ప్యాచ్ వర్క్ పనులకు నిధులు మంజూరు చేశారు. రోడ్డు బాగా దెబ్బతిన్న చోట్ల గుర్తించిన 13 కిలోమీటర్ల పొడవులో ప్యాచ్ వర్క్ గతంతో చేయగా బాగా రోడ్డు దెబ్బతిన్న ప్రధానమైన చోట్ల ప్రస్తుతం మరమ్మత్తులు జరుగుతున్నాయి. గుర్రంపోడు బ్రిడ్జిపై భాగంతోపాటు మరో రెండు వందల మీటర్లు, కొప్పోలు బస్‌స్టాండ్ వద్ద చెరువు అలుగు వద్ద బ్రిడ్జితోపాటు మరో రెండు వందల మీటర్ల ప్యాచ్ వర్క్ పనులు జరుగుతున్నాయి. చింతల చెరువు క్రింది భాగంలో ప్రధాన రహదారి బాగా దెబ్బతిన్నందున కొత్తగా రోడ్డును నిర్మిస్తున్నారు. ప్రధానంగా బాగా దెబ్బతిన్న గుర్రంపోడు శివారులోని నిజాం కాలం నాటి బ్రిడ్జిపై వర్షపు నీరు క్రిందకు వెళ్లేలా గతంలో గల రంధ్రాలను పునరుద్ధరించి ఒక వరుస తారు వేయనున్నారు. ప్రస్తుతానికి మరమ్మతులేనని, పూర్తిస్థాయిలో రోడ్డు విస్తరణకు గతంలోనే హైవే అథారిటీకి ప్రతిపాదనలు పంపించామని ఇంకా నిధులు మంజూరు కావల్సి ఉందని ఆర్అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు.

అంగడిబజార్ రోడ్డుకు మహర్దశ

- నెరవేరనున్న డిండి వాసుల కల
- రూ.3.90కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం
- డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



అంగడి బజార్ రోడ్డు ఇదే..



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్(ఫైల్)

డిండి: హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గమధ్యలో ఉన్న డిండి మండల కేంద్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. అంతేగాక జిల్లా కేంద్రానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో అభివృద్ధి కి నోచుకోలేదు. ప్రస్తుతం పట్టణ ప్రజల కోరిక మేరకు ఇటీవల ఐబీ క్వాటర్స్ నుంచి అంగడీ బజార్ మీదుగా ఆదర్శ పాఠశాల వరకు సీసీరోడ్డు, అక్కడి నుండి ప్రభుత్వ విత్తనోత్పత్తి కేంద్రం (డిండి- దేవరకొండ బీటీరోడ్డు) వరకు బీటీరోడ్డు పనుల నిర్మాణానికి ఎంపీ రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శంకుస్థాపన చేశారు. పనులు పూర్తయితే అంగడి బజార్ రోడ్డు మార్గం రూపురేఖలు మారనున్నాయి.

చిన్నపాటి వర్షానికే చిత్తడిగా రోడ్డు

వర్షాకాలంలో కురిసే చిన్నపాటి వర్షాలకు అంగడి బజారు రోడ్డు వెంట ఉన్న గుంటలలో వర్షపు నీరు నిలిచి రోడ్డు చిత్తడిగా మారడంతో అంగడి బజారు గుండా రాకపోలకలు ఇబ్బందులు కలిగేదని స్థానికపేర్కొంటున్నారు. ఈ క్రమంలో అంగడి బజారుకు నూతన రోడ్డుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న డిండి ప్రజల కోరిక త్వరలోనే తీరనుంది.

మారనున్న రూపురేఖలు

పట్టణ ప్రజల కోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ చొరవతో అంగడి బజార్‌లో నూతన సీసీరోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. ఈ క్రమంలో దాదాపు 70 ఫీట్ల వరకు సీసీరోడ్డు నిర్మాణం మధ్యలో డివైడర్, వివిధ రకాల పూల మొక్కలు తోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు దాదాపు రూ. 3.90 కోట్లు ఖర్చు అంచనా వేస్తూ చేపట్టే పనులకు ఇటీవల ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాన చేసారు. దీంతో స్థానికులతోపాటు ఇదే మార్గం గుండా ప్రతినిత్యం రాకపోలకు కొనసాగిస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు, శ్రీ చెన్నకేశవ ఆలయానికి వెళ్లే భక్తులు, ప్రతి శుక్రవారం నిర్విహించే సంతకు వచ్చే చిరు వ్యాపారస్థులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ పనులు త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.

రుణపడి ఉంటాం



డిండి పట్టణంలోని అంగడి బజార్‌కు సీసీరోడ్డు తోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే బాలూనాయక్ నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాన చేయడం చాలా ఆనందంగా ఉంది. ఎమ్మెల్యేకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– బి. శ్రీనివాస్‌గౌడ్
చిరు వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు

సంతోషంగా ఉంది



వర్షాకాలంలో ఆదర్శ పాఠశాలకు వెళ్లే సమయంలో మార్గమధ్యలోని అంగడి బజార్ రోడ్డు వెంట ఉన్న గుంతల వద్ద నీరు నిలిచేది. దీంతో అటు నుంచి వెళ్లలేకపోయే వాళ్లం. ఇలాంటి సందర్భాల్లో అంగడి బజార్‌కు సీసీరోడ్డును మంజూరు చేయటం చాలా సతోషంగా ఉంది.

– బి. ఇందు, ఆదర్శ పాఠశాల విద్యార్థిని

అభివృద్ధే లక్ష్యం



జిల్లా కేంద్రానికి దాదాపు 100 కిలో మీటర్ల దూరంలో ఉన్న వెనుబడిన డిండి మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే బాలూనాయక్ పని చేస్తున్నారు. పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తారు.

– దొంతినేని వెంకటేశ్వరరావు
బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు